సంపుటి :02 సంచిక :133 పేజీలు :04 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 15, జూలై 2025



# అవినీతిపై యుద్ధం

- విజృంభిస్తున్న ఏసీబీ
- నాలుగు నెలల్లో వందలాది కేసులు,
- రూ.600 కోట్ల సీజ్

04

## రౌడీని పట్టిస్తే రూ.5 వేల నజరానా..!

- తోటి రౌడీలకు మిల్స్ కాలనీ పోలీసుల బంపర్ ఆఫర్
- బీరన్న ఉత్సవాల్లో ఘర్షణ.. పరారీలో నిందితుడు



మిల్స్ కాలనీ పోలీసులు రౌడీ షీటర్స్ కు బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఇదేంటి అనుకుంటున్నారా? ఈ సందేహం వాస్తవమే అయినప్పటికీ ఓ నేరంలో ఇన్వాల్వ్ అయిన రౌడీని పట్టిస్తే రూ.5 వేలు బహుమతిగా ఇస్తానని పేర్కొన్నారట. రౌడీలకు పోలిసుల ఆఫర్ ఏంటని ఆశ్చర్యపోవడం కామనే అయినప్పటికీ.. ప్రజా ప్రతినిధుల సేవలో వాళ్ళు బిజీ కదా అందుకే ఈ నిర్ణయానికి వచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– అక్షరదర్బార్, హనుమకొండ ప్రతినిధి

02

- డంపులు చేసి ఇసుకను అమ్ముకుంటున్న వైనం
- విలాసాగర్ సాక్షిగా నడుస్తున్న ఇసుక బాగోతం
- పేరుకే ట్రాక్టర్లు ఆ తర్వాత లారీల్లో తరలింపు
- కొరవడుతున్న సంబంధిత అధికారుల నిఘా
- అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ఆరోపణలు



## మిడ్ నైట్ ఇసుక స్మగ్లర్లు

02

విలాసాగర్ ఇసుక వరంగల్ మార్కెట్ తరలింపు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ సాక్షిగా ఇసుక బాగోతం రాజ్యమేలుతున్నది. విలాసాగర్ పరిధిలోని మానేరు వాగులో ట్రాక్టర్ల పేరుతో పర్మిషన్లు తీసుకున్న కొందరు ఇసుకాసురులు దాన్ని పక్కదారి మల్లించి సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో రాష్ట్రం లో ఇసుక ధరలకు రెక్కలు రాగ దాన్ని అదునుగా తీసుకుంటున్న కొందరు ఇసుక స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ల పేరుతో పొద్దంతా ఇసుకను తీసుకురావడం వాటిని డంపులుగా చేసి లారీల్లో తరలించడం వారికి నిత్యప్రాయంగా మారింది. అర్ధరాత్రుళ్ళు అధికారుల కళ్ళు కప్పుతున్నారో లేక వారి దర్శకత్వ పర్యవేక్షణ ప్రాయమో దేవుడెరుగు కాని యథేచ్ఛగా ఇసుక మాఫియా కోరలు చాచి బుసలు కొడుతున్నది. దీంతో విలాసాగర్ సాక్షిగా ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుండగా పట్టించుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం నెలవారీ ఆమ్యామ్యాల మత్తులో ఊగుతున్నట్లుగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

- అక్షరదర్బార్, కాటారం

## డెంటిస్ట్ ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్ట్



- అరెస్టయిన వారిలో భర్త డాక్టర్ సృజన్, అత్త, మామ, శృతి
- కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వెల్లడి

02



## విశ్రాంత ఈఎన్సీ మురళీధర్ రావు అరెస్ట్

జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సోదాలు

- బంధువులు, సన్నిహితుల ఇండ్లలో ఏకకాలంలో తనిఖీలు
- ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి ఆధారాల సేకరణ

03

నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఇన్ ఛీఫ్ (ఈఎన్సీ) మురళీధర్‌రావును మంగళ వారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నివాసంలో సోదాలు కూడా చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టుల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించి జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు సమాచారం. ఇక ఈ కేసులో మరింత సమాచారం తెలియాల్సి ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ను విచారించనున్నారు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02



## మలక్‌పేటలో గన్ ఫైరింగ్

సీపీఐ నేత చందునాయక్‌పై దుండగుల కాల్పులు

- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- భూతగాదాల నేపథ్యంలోనే హత్య



03

# డెంటిస్ట్ ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్ట్

- అరెస్టయిన వారిలో భర్త డాక్టర్ సృజన్, అత్త, మామ, శృతి
- కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వెల్లడి

అక్షరదర్బార్, హసన్ పర్తి: డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ప్రత్యూష భర్త డాక్టర్ అల్లాడి సృజన్, ఆయన తండ్రి అల్లాడి మధుసూదన్, తల్లి అల్లాడి పుణ్యవతితో పాటు బానోతు శృతి అరెస్టయిన నలుగురిలో ఉన్నారు. హసన్ పర్తి మండల కేంద్రానికి చెందిన డెంటిస్ట్ అల్లాడి ప్రత్యూష ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ప్రత్యూష ఆత్మహత్య కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం కాజీపేట ఏసీపీ పి ప్రశాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం అల్లాడి సృజన్, ప్రత్యూష వివాహం 2017 ఆగస్టు ఆగస్టు 17న జరిగింది. వీరిద్దరూ డాక్టర్లు. సృజన్ కార్డియాలజిస్ట్ కాగా ప్రత్యూష డెంటిస్ట్. సృజన్ హనుమకొండలోని మెడికవర్ ఆసుపత్రితో పాటు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆసుపత్రి యాజమాన్యం పబ్లిసిటీ కోసం తమ ఆసుపత్రిలోని స్పెషలైజేషన్ కలిగిన డాక్టర్లను ఇంటర్వ్యూ చేసేందుకు ఇన్స్టాగ్రామ్ లో ఎక్కువమంది ఫాలోవర్ అయిన యువతి బానోతు శృతిని ఆసుపత్రికి పిలిచారు. ఆమె అల్లాడి సృజన్ ఇంటర్వ్యూ చేసి




నప్పటి నుంచి సృజన్ కు బానోతు శృతితో పరిచయం ఏర్పడింది. దీంతో సృజన్ ఆమెతో సన్నితంగా ఉంటుంది. ఆమె తన ఇన్ స్టా అకౌంటు బుట్ట బొమ్మ- 17 లో రీల్స్ చేస్తూ పెట్టగా వాటిని ఫాలో అయి ఆ తర్వాత వారిద్దరూ వాట్సాప్ ద్వారా చాటింగ్ చేసుకుంటూ చనువుగా ఉండేవారు. కొద్ది నెలల క్రితం ఈ విషయం సృజన్ భార్య ప్రత్యూషకు తెలిసింది. దీంతో ప్రత్యూష తన భర్తను హెచ్చరించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. దీనికి తోడు సృజన్ తల్లి దండ్రులు అతనికి అండగా ఉండి ప్రత్యూషపై కోపం చేసేవారు. ఇందులో భాగంగా ఆదివారం దంపతులు సృజన్, ప్రత్యూష మధ్య శృతి విషయంలో వాగ్వాదం జరిగింది. జీవితంపై విరక్తి చెందిన ప్రత్యూష ఇంట్లో బెడ్ రూమ్ లోకి వెళ్లి తలుపులు పెట్టుకుని ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడింది. ఈ కేసులో విచారణ జరిపి ప్రత్యూష భర్త డాక్టర్ సృజన్, ఆయన తండ్రి మధుసూదన్, తల్లి పుణ్యవతితో పాటు బానోతు శృతిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.



# మిడ్ నైట్ ఇసుక స్మగ్లర్లు

- విలాసాగర్ ఇసుక వరంగల్ మార్కెట్ తరలింపు
- డంపులు చేసి ఇసుకను అమ్ము కుంటున్న వైనం
- విలాసాగర్ సాక్షిగా నడుస్తున్న ఇసుక బాగోతం
- పేరుకే ట్రాక్టర్లు ఆ తర్వాత లారీల్లో తరలింపు
- కొరవడుతున్న సంబంధిత అధికారుల నిఘా
- అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ఆరోపణలు



అక్షరదర్బార్, కాటారం: జయశంకర్ భూపాల పల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ సాక్షిగా ఇసుక బాగోతం రాజ్యమేలుతున్నది. విలాసాగర్ పరిధిలోని మానేరు వాగులో ట్రాక్టర్ల పేరుతో పర్మిషన్లు తీసుకున్న కొందరు ఇసు కాసురులు దాన్ని పక్క దారి మళ్లించి సొమ్ము చేసుకుంటు న్నారు. వర్షాకాలం కావడంతో రాష్ట్రం లో ఇసుక ధరలకు రెక్కలు రాగ దాన్ని అదునుగా తీసుకుంటున్న కొందరు ఇసుక స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ల పేరుతో పొద్దంతా ఇసుకను తీసుకురావడం వాటిని డంపులుగా చేసి లారీల్లో తరలించడం వారికి నిత్యప్రాయంగా మారింది. అర్ధరాత్రుళ్ళు అధికారుల కళ్ళు కప్పుతున్నారో లేక వారి దర్శకత్వ పర్యవేక్షణ ప్రాయమో దేవుడెరుగు కాని యథేచ్ఛగా ఇసుక మాఫియా కోరలు చాచి బుసలు కొడుతున్నది. దీంతో విలాసాగర్ సాక్షిగా ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుండగా పట్టించుకో వాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం నెలవారీ ఆమ్యామ్యాల మత్తులో ఊగుతున్నట్లుగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

**విలాసాగర్ టూ వరంగల్**

నెల రోజుల నుండీ వర్షాకాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా నడిచే ఇసుక క్వారీలు మూతపడిన విషయం విధితమే. మార్కెట్ లో సాధారణ రోజుల్లో టన్నుకు రూ. 1000 నుండీ రూ. 1200 వరకు ఉండగా వర్షాకాలం కావడంతో ప్రస్తుతం టన్నుకి రూ.1600 చొప్పున అమాంతం పెరిగింది. దీంతో మార్కెట్ లో ఇసుక ధరలకు రెక్కలు రాగా ఓవైపు మహదేవ పూర్ ప్రాంతంలో టీజీఎండిసి ఆధ్వర్యంలో నడిచే ఇసుక క్వారీల్లో ఇసుక లోడింగ్ నిలిపివేయడంతో క్వారీలు మూతప డ్డాయి. ఈ క్రమంలో ఏం చేయాలో తోచని కొందరి ఇసుకా సురుల కళ్ళు కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు వాగుపై పడ్డాయి. ఇక అనుకున్నదే ఆలస్యమనుకున్న సదరు ఇసుక స్మగ్లర్లు విలాసాగర్ నుండి ట్రాక్టర్లు ద్వారా ఇసుకని తీసుకువచ్చి వారికి చెందిన రహస్య ప్రాంతాల్లో డంపులు ఏర్పాటు చేసుకున్నట్లుగా సమాచారం. ఆ ఇసుకని రాత్రికి రాత్రే లోడ్ చేసుకుని వరంగల్ మార్కెట్ కు తరలిస్తూ పెద్ద మొత్తంలో క్యాష్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

**- కొరవడుతున్న నిఘా**

గత కొన్ని రోజులుగా విలాసాగర్ మానేరు వాగు కేంద్రంగా నడుస్తున్న అక్రమ ఇసుక రవాణా వ్యవహారాన్ని సంబంధిత అధికారులు మామూలుగా తీసుకుంటున్నట్లుగా పలువురు గుసగుసలాడుతున్నారు. అధికారుల నిఘా వైఫల్యంతోనే అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు అక్కడి ప్రాంత వాసులు అభిప్రాయపడుతున్నారు. ఇసుక ట్రాక్టర్ల విషయంలో ఎలాంటి విధి విధానాలు లేకపోవడంతోనే విలాసాగర్ ఇసుక పక్కదారి పడుతుందని స్థానిక అవసరాల కోసమని ఖచ్చితమైన విధానాన్ని తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.అధికా రుల కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు జరిగితే ఇంకా బాగుం టుందని పలువురు సూచనలు ఇస్తున్నారు.ఈ మేరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రౌడీని పట్టిస్తే రూ.5 వేల నజారానా..!

- తోటి రౌడీలకు మిల్స్ కాలనీ పోలీసుల బంపర్ ఆఫర్
- బీరన్న ఉత్సవాల్లో ఘర్షణ.. పరారీలో నిందితుడు



అక్షరదర్బార్, హనుమకొండ ప్రతినిధి : మిల్స్ కాలనీ పోలీసులు రౌడీ షీటర్స్ కు బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఇదేంటి అనుకుంటున్నారా? ఈ సందేహం వాస్తవమే అయినప్పటికీ ఓ నేరంలో ఇన్వాల్వ్ అయిన రౌడీని పట్టిస్తే రూ.5 వేలు బహుమతిగా ఇస్తానని పేర్కొన్నారట. రౌడీలకు పోలీసుల ఆఫర్ ఏంటని ఆశ్చర్య పోవడం కామనే అయినప్పటికీ.. ప్రజా ప్రతినిధుల సేవలో వాళ్ళు బిజీ కదా అందుకే ఈ నిర్ణయానికి వచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**- అసలు ఏం జరిగింది?**

కొద్దిరోజుల కిందట మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉర్సు కరీ మాబాద్ ప్రాంతంలో బీరన్న ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ కార్యక ర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘర్షణకు కారణమైన ప్రధాన నిందితుల్లో బీజేపీ పార్టీలో కొనసాగుతున్నట్లు చెబుతున్న రౌడీ షీటర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడిని పట్టుకోవడం పోలీసులకు సవాల్ గా మారినట్లు తెలిసింది. దీంతో అక్కడి పోలీస్ అధికారి స్థానిక రౌడీ షీటర్ల తో కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి నిందితుడి ఆచూకీపై ఆరా తీసినట్లు సమాచారం. అయితే అతడి ఆచూకీపై స్పష్టమైన సమాచారం లేనందున సదరు తోటి రౌడీలకు ఈ బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. నిందితుడిని పట్టించిన వారికి రూ.5 వేలు ఇస్తానని ప్రకటించడం వివాదానికి దారి తీసినట్లు తెలుస్తోంది. మరీ దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# భూమిపైకి శుభాన్షు !

- కాలిఫోర్నియాలో లాండ్ అయిన క్యాప్సూల్
- భారత దేశ వ్యాప్తంగా సంబురాలు
- వ్యోమగాముల టీంకు భారత ప్రధాని మోదీ అభినందనలు

అక్షరదర్బార్, హైదరాబాద్: యాక్సియం-4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం సురక్షితంగా భూమికి చేరుకుంది. రోదసిలో 18 రోజులు గడిపి, మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను విజయవం తంగా నిర్వహించిన ఈ బృందం.. స్పేస్ఎక్స్ డ్రాగన్ కాప్సూల్లో కాలిఫోర్నియాలోని సాన్ డియాగో తీరంలో మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు లాండ్ అయింది. వ్యోమగాములను అమెరికా నాసా బృందం వెంటనే రిహాబిలి టేషన్ సెంటర్‌కి తరలించింది. క్వారంటైన్ పూర్తయిన తర్వాత శుభాన్షు స్వస్థలానికి చేరుకుని తన కుటుంబాన్ని కలుసుకోను న్నారు. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్ పేర్కొన్నారు. మరోవైపు యాక్సియం-4 మిషన్ విజయవంతం కావడంపై భారతీయుల్లో ఆనందం వ్యక్తమైంది. గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటు ఆయన బృందం సురక్షితంగా తిరిగి రావడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. స్వస్థలం లఖ్‌నవూలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన టీంకు భారత ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.



**ఆహారం, విత్తనాలపై పరిశోధన..**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో సోమవారం బయ లుదేరింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ- విస్నియెస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే. అమెరికా వ్యోమగామి పెగ్గీ విట్సన్ కమాండర్‌గా, శుక్లా పైలట్‌గా వ్యవహరించిన ఈ మిషన్‌లో పోలాండ్‌కు చెందిన స్లావోస్ ఉజ్నాన్స్కీ, హంగేరీకి చెందిన తిబోర్ కూడా పాల్గొన్నారు. 40 ఏళ్ల తర్వాత భారత్, పోలాండ్, హంగేరీలకు చెందిన వ్యోమగా ములు రోదసిలోకి వెళ్లడం విశేషం. శుక్లా బృందం మైక్రో గ్రావిటీ వాతావరణంలో ఆహారం, మైక్రో అల్గే, విత్తనాలపై 60కిపైగా ప్రయోగాలు చేపట్టారు.


## వైద్య సేవలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అక్షర దర్బార్, కమలాపూర్: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం కమలాపూర్‌లోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి, ల్యాబ్, ఫార్మసీ, ఎక్స్‌రే, పేషెంట్ ఆహారం వంటి విభాగాలను పరిశీలించారు. ప్రసూతి సేవలు పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. పోర్టబుల్ ఎక్స్‌రే మిషన్ అందుబాటులోకి తేవాలని, మందుల స్టాక్ రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. డయేరియా కేసులపై తాగునీటి నాణ్యత చూడాలన్నారు. శానిటేషన్, డయాగ్నొస్టిక్ శాంపుల్స్ పంపిణీ తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## ప్రతి ఒక్కరికి జీవిత భీమా అవసరం: ఎస్‌బీఐ లైఫ్

అక్షర దర్బార్, కాటారం: జీవిత భీమా ప్రతి ఒక్కరికి అవసరమని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ నల్లపురి హరికృష్ణ తెలిపారు. కాటారం మండలానికి చెందిన ఎస్‌కే సబ్దార్ గుండెపోటుతో మృతి చెందగా, ఆయన తీసుకున్న ఎస్‌బీఐ లైఫ్ పాలసీ ద్వారా రూ.5 లక్షల భీమా చెక్కును భార్య సోనికి అందజేశారు. మిగిలిన వాయిదాలను కంపెనీ భరిస్తుందని, పాలసీ కొనసాగుతుందని తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ద్వారా చిల్డ్రన్ పాలసీలు, ఇన్వెస్ట్మెంట్, పెన్షన్, టర్మ్ ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ భద్రత కోసం జీవిత భీమా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైఫ్ మిత్రలు, మేనేజర్లు పాల్గొన్నారు.



# గడువులోగా పూర్తి చేయండి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్ నిర్మాణాల పరిశీలన



అక్షరదర్బార్, వరంగల్: నూతన సమీకృత కలెక్టరేట్ల భవన సముదాయాల నిర్మాణా పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్ లోని ఆజంజాహి మిల్స్ గ్రౌండ్ లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను సందర్శించి పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయాల సముదాయాలలో మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండవ అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున ఫినిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన సిబ్బందిని వనరులను వియోగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాంపౌండ్ వాల్, పైప్ లైన్ తదితర నిర్మాణ పనులను కూడా ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా రోడ్లు, భవనంల శాఖ అధికారి రాజేందర్, డీఈ శ్రీధర్, నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.


# వాటర్ బాటిల్ అడిగి..చైన్ స్నాచింగ్

**మహిళ మెడలోని గొలుసు అపహరణ**



అక్షరదర్బార్, వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మూడు తులాల నర పుస్తెలతాడుతో ఉడాయించారు. పట్టణ శివారులోని డీసీతండాకు చెందిన మహిళ బానోతు పూరి మంగళవారం వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి పక్కనే గల కిరాణ షాప్ లో ఒంటరిగా ఉంది. గమనించిన దుండగులు స్కూటీపై వచ్చి వాటర్ బాటిల్ కావాలని షాప్ వద్ద ఉన్న ఆమెను అడిగారు. ఈ క్రమంలో దుండగులు దాడి చేసి సదరు మహిళ మెడలో ఉన్న మూడు తులాల నర పుస్తెలతాడు లాకెళ్ళారు. ఈ సందర్భంగా దుండగులకు, బాధితురాలికి మధ్య గలాటా చోటుచేసుకుంది. ఈ గలాటలో నిందితులు ఉపయోగించిన క్యాప్, ఓ బ్లాంకెట్ అక్కడే వదిలి వెళ్లారు. దుండగులు అపహరించిన బంగారం గొలుసు విలువ రూ.3 లక్షలకు పైగా ఉంటుందని తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల జాడ కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు.





# మలక్‌పేటలో గన్ ఫైరింగ్

## సీపీఐ నేత చందునాయక్‌పై దుండగుల కాల్పులు

- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- భూతగాదాల నేపథ్యంలోనే హత్య

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: హైదరాబాద్‌లోని మలక్‌పేటలో దుండగుల కాల్పులు కలకలం సృష్టించాయి. శాలివాహన నగర్‌లోని పార్క్ వద్దకు మంగళవారం ఉదయం కొందరు దుండగులు స్విఫ్ట్ కారులో వచ్చారు. అక్కడ చందునాయక్(43) అనే సీపీఐ నేత తన భార్య, పిల్లలతో కలిసి వాకింగ్ చేస్తుండగా అతడి కళ్లలో కారం కొట్టారు. అనంతరం తుపాకులతో ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన చందూనాయక్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పార్క్‌లో వాకింగ్ చేసుకుంటుండగా ఒక్కసారిగా కాల్పులు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అక్కడి నుంచి వాకర్స్ పరుగులు పెట్టారు. సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. దేవరుప్పలకు చెందిన సీపీఐ (ఎంఎల్) నాయకుడు రాజేశ్‌పై ఆమె అనుమానం వ్యక్తం చేశారని వెల్లడించారు. భూతగాదాల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. మృతుడు చందూనాయక్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సాయిపల్లి అని పోలీసులు తెలిపారు. ఆయన గతంలో సీపీఐ ఎంఎల్ పార్టీ నుంచి సీపీఐలో చేరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో చందూనాయక్ నిందితుడిగా ఉన్నారు. మరో వైపు కాల్పులు జరిపిన రాజేశ్, సుధాకర్ మరో ఇద్దరు నిందితులు ఎస్‌వోటీ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం.



# ప్రతి గడప నుంచి విధిగా చెత్త సేకరణ జరగాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 37, 38 డివిజన్లలో క్షేత్ర స్థాయి శానిటేషన్ తనిఖీలు

అక్షరదర్బార్, వరంగల్: ప్రతి గడప నుంచి విధిగా చెత్త సేకరణ జరగాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం నగర పరిధిలోని 37, 38 డివిజన్ ఖిలావరంగల్ ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సానిటేషన్ నిర్వహణ తీరును పరిశీలించి నిర్వహణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని, ప్రతి డివిజన్ లో ఇద్దరు జవాన్ లు మాత్రమే విధులు నిర్వహించాలని, ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో జవాన్లకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, సిబ్బంది హాజరు నిర్వహణ పారదర్శకంగా కొనసాగాలని పేర్కొన్నారు. నిర్దేశించిన ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల లక్ష్యాలను జవాన్ లు చేరుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డాశరాజేష్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, హెల్త్ ఇన్ స్పెక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు అరెస్ట్

- జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సోదాలు
- బంధువులు, సన్నిహితుల ఇండ్లలో ఏకకాలంలో తనిఖీలు
- ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి ఆధారాల సేకరణ



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్ ఇన్ ఛీఫ్ (ఈఎన్సీ) మురళీధర్‌రావును మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నివాసంలో సోదాలు కూడా చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టుల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు ఏసీబీ అధికారులు గుర్తించి జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు సమాచారం. ఇక ఈ కేసులో మరింత సమాచారం తెలియాల్సి ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ను విచారించనున్నారు. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌తో పాటు మురళీధర్‌రావు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఈఎన్‌సీ జనరల్‌గా కీలకంగా వ్యవహరించిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మురళీధర్‌రావు పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు మురళీధర్ రావు పదవిలో ఉన్నారు. కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై విజిలెన్స్ నివేదిక తర్వాత ప్రభుత్వం ఆయన్ను విధుల నుంచి తప్పించింది. అలాగే కాళేశ్వరం కుంగుబాటు అంశంలో ఇప్పటికే మాజీ ఈఎన్సీ మురళీధర్ రావును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరిపింది. కాళేశ్వరం కమిషన్ జరిపిన విచారణలో మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు కమిషన్ అడిగిన ప్రశ్నలకు 'తెలియదు.. మర్చిపోయాను' అంటూ సమాధానం ఇచ్చారు. ఇక విజిలెన్స్ నివేదికలోనూ మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు పేరును అధికారులు చేర్చారు. ఈ క్రమంలోనే మురళీధర్ రావు ఇంట్లో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

**కాళేశ్వరంలో కీలక పాత్ర**

మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత దగ్గరి మనిషిగా మురళీధర్ రావుకు పేరుంది. అధికారుల్లో ఈయనంటే హడల్. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కీలక భూమిక పోషించారు. అంతే స్థాయిలో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి బిల్లు ఈయన చేతులమీదుగానే రిలీజ్ అయ్యేంది. ఏదైనా తప్పు ఉంటే హెచ్చరించి బిల్లు ఆపేసే అధికారం ఈయనదే. కానీ, అలా ఎప్పుడూ చేసిన సందర్భాలు లేవన్న చర్చ ఉన్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్ననాళ్లూ లక్షల కోట్ల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగాయి. అలాగే, రూ.50 కోట్ల దాకా తాగునీటి ప్రాజెక్ట్స్‌కు పూనుకున్నారు. వీటన్నింటిలో కీలక పాత్రధారి మురళీధర్ రావు. పదేళ్లలో జరిగిన ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు బలంగా వినిపించాయి. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆయన్ను పదవిలో నుంచి వెళ్లిపొమ్మని చెప్పింది. 2024 ఫిబ్రవరిలో ఈయన రాజీనామా చేశారు.

**కొడుకు కంపెనీకి కాంట్రాక్టులు?**

మురళీధర్ రావు ఈఎన్సీగా ఉన్నప్పుడు కొడుకు సాయి అభిషేక్ రావు కంపెనీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. ఓ కంపెనీలో వరంగల్ కు చెందిన హర్షవర్ధన్ రెడ్డి అనే వ్యక్తిని చేర్పించి, తర్వాత తన కుమారుడికి ప్రయారిటీ దక్కేలా చూసుకున్నారని, పాలమూరు, కాళేశ్వరంలో భారీగా సబ్ కాంట్రాక్టులు వచ్చేలా చేశారని ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేని ఆ కంపెనీకి కాంట్రాక్టులు ఇవ్వడంలో మురళీధర్ రావు అన్నీ తానై చూసుకున్నట్టు అధికార వర్గాల్లో చర్చ ఉన్నది. మురళీధర్ రావు తన కొడుకు భాగస్వామిగా ఉన్న హర్ష కన్స్ట్రక్షన్ కు డబ్బులు మళ్లించారని కూడా ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది.

# బాలాజీలో ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ వేడుకలు

నర్సంపేట, అక్షర దర్బార్: నర్సంపేట రూరల్ మండలం లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్లో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్.సి.సి పదవ బెటాలియన్ ఆదేశాల మేరకు, ఎన్.సి.సి థర్డ్ ఆఫీసర్ యం.డి. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ పి. రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, యువతకు నైపుణ్యాలు చాలా అవసరమని, వాటితోనే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత నైపుణ్యాలను పెంపొందించడానికి అనేక సంక్షేమ పథకాలను, నైపుణ్య శిబిరాలను నిర్వహిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యం

## బాలాజీ విద్యాసంస్థల చైర్మన్

నర్సంపేట, అక్షర దర్బార్: బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఆంద్రా రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటితేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్, అక్షర స్కూల్‌లో వన మహోత్సవ కార్యక్రమం




ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ పిల్లలతో మొక్కలు నాటించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రటరీ, ప్రిన్సిపాల్స్, సి.ఏ.ఓ., ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చల్లా ధర్మారెడ్డి నివాళులు

పరకాల, అక్షర దర్బార్: పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చందుపట్ల తిరుపతి రెడ్డి తల్లి చందుపట్ల రాధమ్మ ప్రథమ వర్ధంతిలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఆయిల్ పామ్ సాగులో
# అధిక లాభాలు

### జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు

దుగ్గొండి, అక్షర దర్బార్: ఆయిల్ పామ్ సాగులో రైతులు అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాగంటి కిరణ్మయి ఆయిల్ పామ్ తోటలో గెలల కోత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ తోటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కోత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు ఆయిల్ పామ్ తోటలకు గల సబ్సిడీ వివరాలను తెలియజేశారు. కొత్తగా సాగు వేసుకునే రైతులు తమ పట్టదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఉద్యాన అధికారిని సంప్రదించాలని కోరారు. దుగ్గొండి మండలంలో ఇదే మొదటిసారిగా ఆయిల్ పామ్ గెలలను కోశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వెనుకంజ

### గండ్ర దంపతులు ఫైర్

రేగొండ, అక్షర దర్బార్: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందని భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ జిల్లా మాజీ జెడ్పి చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి విమర్శించారు. మంగళవారం గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటుచేసిన "పోరాడుదాం సాధిద్దాం" కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పాలన 'యాక్షన్ ఫుల్', 'అభివృద్ధి నిల్' అని ఎద్దేవా చేశారు. రైతు బంధు నాట్లు వేసే కాలమని, రైతు భరోసా ఎన్నికల కాలమని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.

**పాలన మరిచిండు... ఎమ్మెల్యేపై గండ్ర ఫైర్**

గోరి కొత్తపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా చేసినా, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాలనను విస్మరించారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలకు శంకుస్థాపన చేసినా, అవి ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబులు అభివృద్ధి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. గోరికొత్తపల్లి మండలంలోని సర్వే నెంబర్ 391, 821, 1652, 653లోని భూములకు పట్టాలు ఇవ్వాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్, కస్తూర్బా గాంధీ పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాలు, ప్రాథమిక



వ్యవసాయ సహకార కేంద్రం, ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హమీద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# "హలో బీసీ ఛలో హైదరాబాద్"కు బీసీ నాయకులు

పరకాల, అక్షర దర్బార్: పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక నిర్వహిస్తున్న "హలో బీసీ చలో హైదరాబాద్" కార్యక్రమానికి నడికూడ, పరకాల, ఆత్మకూరు, దామెర మండలాల నుండి బీసీ నాయకులు బయలుదేరారు. నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు), పరకాల పట్టణ సీనియర్ నాయకులు బండి సారంగపాణి తదితరుల ఆధ్వర్యంలో ఈ నాయకులు హైదరాబాద్‌కు బయలుదేరారు.



## ఫోటోగ్రాఫర్లకు అండగా..

అక్షర దర్బార్, రేగొండ: జిల్లా ఫోటోగ్రాఫర్ల సంఘం నూతన అధ్యక్షుడు రఘోత్తం రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ సింగరి కిరణ్ బైక్ ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ కావడం తెలిసిన వెంటనే ఆయనకు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. "ఆపదలో నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా కల్పించిన రఘోత్తం రెడ్డి చర్యకు సంఘసభ్యుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల సంఘ నేతలు జంబుల రఘు, ఎల్లండి రాకేష్, దాసారపు సదానందం, గుగులోతు రాజేందర్ నాయక్, బండి కమలాకర్, మోరే మొగిలి తదితరులు పాల్గొన్నారు.




# అవినీతిపై యుద్ధం

- విజృంభిస్తున్న ఏసీబీ
- నాలుగు నెలల్లో వందలాది కేసులు,
- రూ.600 కోట్ల సీజ్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం : తెలంగాణలో అవినీతిపై యుద్ధం ప్రారంభమైంది. రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీపీ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏసీబీ ఇంతకు ముందు ఎన్నడూ లేని స్థాయిలో దూకుడుగా వ్యవహరిస్తోంది. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో లంచగొండుల గుండెల్లో కలకలం రేగుతోంది.

గడచిన నాలుగు నెలల్లో ఏసీబీ దాడుల్లో దాదాపు 100 మంది అవినీతి అధికారులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.17 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 25 కేసులు పోలీసు శాఖపై, మరో 25 కేసులు రెవెన్యూశాఖపై నమోదు కావడం గమనార్హం. మూడవ స్థానంలో మున్సిపల్ ఉద్యోగులున్నారు. మొత్తం మీద 100 కేసులు నమోదు అయ్యాయి.

**హరిరాం కేసుతో సంచలనం..**

ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఈఎన్సీ హరిరాంను అరెస్ట్ చేసి, ఆయన అక్రమంగా కూడబెట్టిన రూ.600 కోట్ల స్థిర–చరాస్తులను సీజ్ చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటన తరువాతే ఏసీబీ చర్యలకు మరింత గణనీయత వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఆక్రమాలపై వ్యూహాత్మక దాడులు:**

ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించిన ఏసీబీ... ఆదాయానికి మించిన ఆస్తులపై ఏడుగురిపై కేసులు నమోదు చేసింది. అలాగే పథకాల అమలులో జరిగిన అక్రమాలపై కూడా నిఘా పెట్టింది.

**ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది..**

సామాన్యులు ఏసీబీపై నమ్మకంతో ఫిర్యాదులు చేస్తుండగా, అధికారులు కూడా సకాలంలో స్పందిస్తున్నట్లు సమాచారం. అన్ని జిల్లాల్లో విచారణల పురోగతిని స్వయంగా సమీక్షిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు డీజీపీ విజయ్‌కుమార్.

ఏసీబీ తాజా దాడులు అవినీతి నియంత్రణలో కీలక మలుపుగా భావించవచ్చు. వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా ముందుకెళ్తున్న ఏసీబీ చర్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి.

**నాలుగు నెలల్లో ఏసీబీ కేసులు ఇవే..**

- నాలుగు నెలల్లో 100 కేసులు, 100 మంది అధికారులు అరెస్ట్
- రూ.17 లక్షల రెడ్‌హ్యాండెడ్ నగదు స్వాధీనం
- రూ.600 కోట్ల అక్రమ ఆస్తుల సీజ్
- పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలే ప్రధానంగా టార్గెట్
- హరిరాం అరెస్ట్‌తో కేసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం